


# తెలుగు వేలుపు

ఎక్కంతం సూర్యనారాయణరావు

దేవతలు వెలిగించిన అద్భుత మణిదీపంలో వెలుగుతూ, వెన్నెలను చెరుగుతున్నాడు చతుర్దశి చంద్రుడు. ఆయన తొందర తొందరగా అడుగులు వేస్తూ దిగుతున్నాడు. ఒకసారి ఆగి, వెనుదిరిగి చూశాడు. బంగారు ఆనంద నిలయం ధగ ధగ మెరుస్తోంది. తను త్వరగా కొండ దిగాలి. త్వరగా గమ్యం చేరుకోవాలి. తన కోసం ఎదురు చూసే ఆమెతో కాసేపు గడిపి, సుప్రభాత వేళకి గుళ్ళో సిద్ధంగా ఉండాలి! వెళ్ళడం ఆలస్యమైతే ఆమె అలుగుతుంది. తిరిగి వెళ్ళడం ఆలస్యమైతే అర్చకులు అలుగుతారు!

ఆయన రెండు మెట్లు దిగి, మలుపు తిరిగాడు. దారి పక్కనున్న చెట్టు చాటునుండీ వీణా వాదన వినిపించింది. ఎవరో భక్తుడు వీణ వాయిస్తూ కొండ ఎక్కుతున్నాడు...

తన ముందు ఉన్నట్టుండి ప్రత్యక్షమైన వ్యక్తిని ఆశ్చర్యంతో చూసి, ఆయన తటాలున ఆగాడు.

''నారాయణ!'' ఎదురుగా నిలిచిన వ్యక్తి చేతులు జోడించాడు.

''ఇప్పుడెందుకు వచ్చావు నారదా?'' బరువుగా నిట్టూర్చి, ప్రశ్నించాడాయన. ఆయన...ఏడుకొండల ఏలిక, వేంకటేశ్వర స్వామి!

''ఆకాశమార్గాన వెళ్తూ ఆనంద నిలయం వైపు దృష్టి సారించాను.

ఆనందనిలయం ధగధగల్ని వెక్కిరిస్తూ మీ వజ్ర కిరీట ధగధగలు నా దృష్టిని ఆకర్షించాయి. దర్శనం చేసుకుని...''

''నారదా, నేను తొందరగా వెళ్ళాలి...'' వేంకటేశ్వర స్వామి కంఠంలో ఆతృత ధ్వనించింది.

''ఏదీ కాని వేళలో ఎక్కడికి స్వామీ ఈ మహా ప్రయాణం?''

''అడిగావా?'' వేంకటేశ్వరుడు నిట్టూర్పు విడిచాడు. ''ఊ... చెప్పక తప్పదుగా! తిరుచానూరికి. వెన్నెల బొమ్మను దర్శించుకుని, మళ్ళీ సుప్రభాతానికి అందుకోవాలి...వస్తాను.''

''నారాయణ! ఒక్క క్షణం...'' నారదుడు చేతుల్ని అడ్డుగా చాపుతూ అన్నాడు. ''చాలా కాలంగా రెండు సందేహాలు నన్ను వదలకుండా పట్టి పీడిస్తున్నాయి...''

''నీ తండ్రిని అడిగి నివృత్తి చేసుకో, నారదా! నన్ను వెళ్ళనీ... అక్కడ ఆమె అలుగుతుంది..''

''చతుర్ముఖుల వారినీ, త్రినేత్రుల వారినీ-ఇద్దర్నీ అడిగాను. నివృత్తి చేయలేకపోయారు. మిమ్మల్నే ఆశ్రయించమన్నారు..''

''భవిష్యత్తులో ఎప్పుడైనా కలుసుకుందాం. అప్పుడు తీరిగ్గా నీ సందేహాలు తీరుస్తాను.''

''నారాయణ! స్వామి ఆ రెండు సందేహాలూ మీకు సంబంధించినవే! చిరకాలంగా నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి. వాటిని మీరు ఇప్పుడే, ఇక్కడే నివృత్తి చేయాల్సిందే!''

''అర్థం చేసుకో నారదా! ఆలస్యమైతే వెన్నెల బొమ్మ విసుక్కుంటుంది. ఆ తరువాత...''

''వెన్నెలబొమ్మ!'' నారదుడు పారవశ్యంగా అన్నాడు. ''అంటే పద్మావతీ అమ్మేగా! లేక...''

''పద్మావతే!'' స్వామి వెంటనే అన్నాడు.

''వెన్నెల బొమ్మ! ఎంత చక్కని పేరో! ముద్దు పేరు పెట్టారా, స్వామీ?'' నారదుడు ప్రశ్నించాడు.

''అబ్బబ్బ! అదలా ఉంచి, నీ సందేహమేమిటో అడుగు నారదా!'' స్వామి విసుగ్గా అన్నాడు. ''తీర్చేసి నా దారిన నేను పోతాను!''

''నారాయణ! ఒక్కటి కాదు స్వామీ, రెండు! రెండూ సందేహాలు!''

''సరే! రెండే! మాటలతో కాలయాపన చేయకుండా అడుగు!'' వేంకటేశ్వరుడు ఆజ్ఞాపిస్తున్నట్టు అన్నాడు.

''ప్రథమ సందేహం: అలనాడు భృగు మహర్షి వైకుంఠానికి వచ్చి, శ్రీమహాలక్ష్మితో ఉన్న మీ మీద ఆగ్రహించి, మీ ధర్మ హృదయాన్ని పాదంతో...''

''తాడనం చేశాడు!'' వేంకటేశ్వరుడు అడ్డువస్తూ అన్నాడు. ''పురాణ శ్రవణం వద్దు నారదా! సందేహమేమిటో అడుగు.''

''నారాయణ! ఆజ్ఞ! అలాగే అడుగుతాను. భృగు మహర్షి మీ హృదయం మీద పాదతాడనం చేశాడు. శ్రీమహాలక్ష్మికి కోపం వచ్చింది. పాదతాడనం చేసిన భృగుమహర్షికి మీరు సపర్యలూ, మర్యాదలూ చేయడం అమ్మకు ఆగ్రహాన్ని తెప్పించింది...''

''కెలకకు నారదా! అడుగు!''

''నారాయణా! అడగబోతున్నాను. మీరే అడ్డువచ్చారు'' నారదుడు చిరునవ్వుతో అన్నాడు. ''ఆగ్రహించిన ఆదిలక్ష్మి అలిగి వెళ్ళిపోయింది. పెనిమిటి మీద అలిగిన అర్ధాంగి సహజంగా పుట్టింటికి వెళ్ళాలి; వెళ్తుంది. అయితే, ఆదిలక్ష్మి పుట్టినిల్లు అయిన క్షీరసాగరానికి వెళ్ళకుండా, ఈ భూలోకంలోని కొల్హాపురం సమీపంలోని అరణ్యం చేరింది. ఎందుకు? ఇదే నా సందేహం!''

''ఊ.. సమాధానం చెప్పలేని సందేహాన్ని వ్యక్తం చేశావు! అలిగి, వైకుంఠ మందిరాన్ని వదిలి వెళ్ళిన అర్ధాంగి లక్ష్మిని ఇంత వరకూ నేను ఆ ప్రశ్న అడగలేదు. అందువల్ల నీ సందేహానికి సమాధానం చెప్పలేను. ఆమెనే అడుగు! ఇంక రెండోది...'' స్వామి తొందర పెట్టాడు.

''సమాధానం ఊహించలేరా, పరంధామా?''

నారదుడు ఆశగా అడిగాడు.

"ఉవిదల హృదయంలో ఏముందో ఊహించలేం, నారదా! త్వరగా నీ రెండో సందేహం..."

"దానికి సమాధానం 'తెలియదు' అని మీరు అనడానికి అవకాశం లేదు! ఎందుకంటే అది దేవరవారికి. అంటే మీకు సంబంధించిందే!"

"అడుగు నారదా!" స్వామి విసుగ్గా అన్నాడు. "నారాయణ! అందుకేగా దరికి అడ్డు వచ్చాను! జాగ్రత్తగా ఆలకించండి. ఆనాడు అలిగి వెళ్ళిపోయిన అర్ధాంగ లక్ష్మిని అన్వేషిస్తూ తమరు తిన్నగా భూలోకానికి దిగి వచ్చారు. ఉత్తరాదిలో అమ్మవారు విడిది చేసిన కొల్హాపురం వైపు వెళ్ళకుండా, ఆమె లేని ఈ వేంకటాద్రి మీదికి చేరుకున్నారు! ఎందుకు?"

వేంకటేశ్వర - స్వామి చిన్నగా నవ్వాడు. "ఊహించు నారదా! సందేహానికి సమాధానం దొరుకుతుంది."

"ఎప్పుడో ఊహించే ప్రయత్నం చేసి, ఓడిపోయాను. చెప్పానుగా స్వామీ; పరమేష్ఠీ, పరమేశ్వరులు కూడా ఊహించలేకపోయారు!" నారదుడు చిరునవ్వుతో అన్నాడు. "అయితే - పద్మావతీదేవి కోసమే అనే అనుమానం నాలో మెరుస్తూ ఉంటుంది. దైవ రహస్యాన్ని అలా ఊహించలేం అంటారు నా జనకులు చతుర్ముఖులు!"

వేంకటేశ్వర స్వామి చిద్విలాసంగా నవ్వాడు. "పద్మ కూడా నేను తన కోసమే దివి నుండీ భువికి దిగివచ్చానని అనుకుంటూ ఉంటుంది, పాపం!"

"నారాయణ! పద్మమ్మ కోసం రాకపోతే మరెవ్వరి కోసం వచ్చినట్టు? కలియుగంలో భక్తులను ఉద్ధరించే సంకల్పంతో వారి కోసం వచ్చారని అనుకోవచ్చా?" నారదుడు ఆశగా అన్నాడు.

"తమ కోసమే దిగి వచ్చి, నిలువు కొలువులో ఉన్నాని భక్తులు అనుకుంటూ ఉంటారు పాపం!" వేంకటేశ్వరుడు చిన్నగా నవ్వాడు.

"అయితే మీరు వచ్చింది భక్తుల కోసం కూడా కాదా? 'వైకుంఠం వాపరిత్యక్తే న భక్తాన్ త్యక్తుము త్సహే!' వైకుంఠాన్నైనా వదులుకుంటాను కానీ, భక్తులను వదలడానికి ఇష్టపడను-అని ఏనాడో సెలవిచ్చారుగా!" నారదుడు తెలివిగా అడిగాడు.

శ్రీవేంకటేశ్వరుడు చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు వెన్నెలను వెక్కిరించింది.

"అది వేరు నారదా! ఆ ఆశ్వాసనం మేరకు భక్తుల్ని ఎప్పుడూ వదిలపెట్టకుండా ఉంటాను!"

"సరే...అర్ధాంగలక్ష్మి ఉన్న కొల్హాపురానికే వెళ్ళక; రామావతారం నాటి అయోధ్యకు వెళ్ళక, కృష్ణావతారం నాటి మధురకో, బృందావనానికో వెళ్ళక-పద్మావతీదేవి కోసమూ కాక; భక్తుల కోసమూ కాక-ఈ త్రిలింగదేశంలో ఎందుకు తిష్ఠ వేసినట్టు? ఎవరి కోసం?" నారదుడు వివరంగా ప్రశ్నించాడు.

"భాష కోసం" వేంకటేశ్వర స్వామి నవ్వుతూ అన్నాడు.

"నారాయణ! ఏమిటీ? భాష కోసమా? ఏ భాష కోసం?"

"తెలుగు భాష కోసం, నారదా!"

"నారాయణ! తె-లు-గు- భాష కోసమా? పరిహాసం కోసమా మీ సమాధానం నారాయణా?" నారదుడి కంఠంలో ఆశ్చర్యం స్పష్టంగా ధ్వనించింది.

"కాదు నారదా! తెలుగు భాష కోసమే నేను ఇక్కడ నిలువు కొలువులో వెలసి ఉన్నాను.!"

నారదుడు నివ్వెరపోయి చూశాడు. "పరంధామా... దేవభాష సంస్కృతం ఉంది కదా! ఆ దివ్య భాషను వదిలిపెట్టి ఈ తెలుగు పక్షపాతం ఏమిటి స్వామీ!"

"దేవభాష దేవభాషే! తెలుగు తెలుగే! ఈ రెండు భాష గురించీ ఒక తెలుగు కవి ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు స్వామీ?"

'జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశభాషలందు తెలుగులెస్స
జగతి తల్లికంటె సౌభాగ్య సంపద
మెచ్చుటాడు బిడ్డ మేలు కాదె!'

అన్నాడు పద్య రూపంలో. తల్లి సంస్కృతి. కూతురు తెలుగు. సౌభాగ్యంలో అమ్మ గొప్పగా ఉంటుందా, ఆడబిడ్డ గొప్పగా ఉంటుందా?" వేంకటేశ్వర స్వామి నవ్వుతూ అడిగాడు.

"తల్లీకూతుళ్ళను పోల్చి చూస్తే- సౌభాగ్యం విషయంలో కూతురే మిన్న తల్లి కన్నా..." నారదుడు సాలోచనగా అన్నాడు. "ఆ తెలుగు కవి ఎవరు నారాయణా!"

"శ్రీనాథుడు. అతడు సామాన్యుడు కాడు. కవిసార్వభౌముడు! ఆంధ్రభాష అందచందాలనూ, సోయగాన్నీ, సౌకుమార్యాన్నీ తన కవితా దర్పణంలో చూపించిన మహాకవి!"

"నారాయణ! ఎవరి మాతృభాషను వాళ్ళు మెచ్చుకోవడంలో విశేషమేముంటుంది?" నారదుడు తేలిగ్గా చప్పరించాడు.

"తెలుగు భాష సోయగం తెలిస్తే అలా అనవు నారదా!" వేంకటేశ్వరుడు చిరునవ్వుతో అన్నాడు. "దేశభాషల్లో గానీ, దేవ భాషలో గానీ లేని ఒక విశిష్టమైన అలంకారం తెలుగు భాషకు ఉంది..."

"అలంకారమా?" నారదుడు అన్నాడు.

"ఆ! శ్రీకారమే ఆ అలంకారం!"

"శ్రీకారమా?" నారదుడు విస్మయంతో అన్నాడు.

"ఔను నారదా. ఆంధ్రభాషను సంస్కరించి, నిర్దుష్టమైన రూపం ఇచ్చి, భాషను శాసించి 'శబ్దశాసనుడుగా', పద్య విద్యకు ఆద్యుడైన 'ఆదికవి'గా ప్రసిద్ధి చెందిన నన్నయభట్టారకుడు అనే తెలుగుకవి శ్రీకారంతో-అంటే 'శ్రీ' అనే అక్షరంతో రచన ఆరంభించే మంగళకరమైన ప్రక్రియను పరిచయం చేశారు!"

"ఈ శ్రీకార సంప్రదాయమేదో నూతనంగా ఉందే!" నారదుడు సాలోచనగా అన్నాడు.

"ఏ ఇతర భాషకూ లేని మరొక మహత్తరమైన 'శక్తి' తెలుగు భాషకు ఉంది నారదా! అదే అక్షర సంపద! యాభైఆరు అక్షరాల వర్ణమాల!"

"యాభైఆరు అక్షరాలే!" నారదుడు ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును! భావ వ్యక్తీకరణకు భాష ముఖ్యం. భాష బలంగా ఉండాలంటే అక్షరాలు ముఖ్యం! మహేశ్వర సూత్రాల ఆధారంగా రూపొందిన దేవ భాష కంటే ఇతోధిక అక్షర సంపదను సొంతం చేసుకున్న, సమర్థవంతమైన, సరసమైన భాష నారదా, తెలుగు!"

"ఈ తెలుగు మీ మహామానసాన్ని తస్కరించినట్లుంది, స్వామీ!" నారదుడు చిరునవ్వుతో అన్నాడు.

"నిజం చెప్పావు నారదా!" వేంకటేశ్వర స్వామి అన్నాడు. "అల్పంలో అనల్పాన్ని వ్యక్తం చేసే మహత్తర శక్తిని తెలుగు భాషకు ఇచ్చింది ఆ అక్షరమాల! తెలుగు భాషకు మరొక అందమైన అలంకారం కూడా ఉంది తెలుసా?"

"నారాయణ! నాకెలా తెలుస్తుంది? తెలియజెప్పండి!"

"ఆ అందమైన అలంకారం. 'పద్యం' నారదా!"

"పద్యమా!!" నారదుడు అర్థం కానట్టు అన్నాడు. "అంటే మన శ్లోకం లాంటిదా, స్వామీ?"

"శ్లోకం కన్నా పటిష్టమైంది; నిర్దుష్టమైంది. మన శ్లోకానికి లేని నిబంధనలు పద్య ఛందస్సులో ఉన్నాయి. అవి పద్యం హృద్యంగా రూపొందండంలో తమ పాత్ర నిర్వహిస్తాయి. అవి రెండు: ఒకటి ప్రాస. రెండు యతి.

"అంటే..."

"ప్రాస అంటే పద్యపాదంలో రెండవ అక్షరం. అన్ని పాదాలలోనూ అదే అక్షరం ఉంటుందన్నమాట! ఇక యతి అంటే- పద్యంలో విశ్రమ స్థానం. తాళం



పడే స్థానం. పద్య పాదంలోని మొదటి అక్షరం యతి స్థానంలో ఉంటుంది.''

''ఇదేదో కఠినతరంగా ఉందే!'' నారదుడు సాలోచనగా అన్నాడు.

''ఈ యతి ప్రాసలు పద్యాన్ని గుర్తుంచుకోవడానికి గొప్పగా సహకరిస్తాయి నారదా! పద్యంలోని మరొక మహాశక్తివంతమైన అంశం ఏమిటంటే-'తక్కువ'లో 'ఎక్కువ'ను ఆవిష్కరించే అవకాశం!''

''నారాయణ! తెలుగును చక్కగా పరిశీలించినట్లున్నారు తమరు!'' నారదుడు నవ్వుతూ అన్నాడు.

''ఇంకొక గొప్ప లక్షణం-శక్తి-విను నారదా!'' శ్రీవేంకటేశ్వరుడు' నవ్వుతో అన్నాడు. ''ఎన్ని అక్షరాలు అంటామో, ఎన్ని అక్షరాలు వింటామో అన్ని అక్షరాలతో వ్రాయగలిగిన జీవ చైతన్య భాష నారదా, తెలుగు! ఆ భాష ఎంత మృదు మధురంగా ఉంటుందంటే..'' అంటూ ఆగాడాయన.

''వినరో భాగ్యము విష్ణు కథ!

వెను బలమదివో విష్ణు కథ''-ఎవరో గానం చేస్తూ మెట్లెక్కుతున్నారు. పాటకు అనుగుణంగా తంబూరా, మద్దెల మ్రోగుతున్నాయి. నారదుడు అప్రయత్నంగా చెవులు రిక్కించాడు. వేంకటేశ్వరుడు తన్మయత్వంతో ఆలకిస్తున్నాడు.

(వి)

''ఆది నుంచి సంధ్యాది విధులతో
వేదంబైనది విష్ణు కథ!
నాదించీ నిదె నారదాదుల చే
వీధి వీధులనె విష్ణుకథ!''

చాలా కంఠాలు పాడుతున్నాయి. నారదుడు వింటూ అప్రయత్నంగా లయబద్ధంగా తల పంకిస్తున్నాడు.

వదలక వేదవ్యాసుడు నుడివిన
విదిత పావనము విష్ణుకథ
సదనంబైనది సంకీర్తనయై
వెదకిన చోటనె విష్ణుకథ!

పాటను పాడుతున్న బృందం మలుపు తిరిగింది. వేంకటేశ్వరుడు, నారదుడూ ఇద్దరూ చూస్తున్నారు. తంబూర వాయిస్తూ, కాషాయ వస్త్రాలు ధరించిన వ్యక్తి పాడుతున్నాడు. ఆయనను అనుసరిస్తున్న యాత్రిక భక్తులు బృందగానం చేస్తున్నారు. భజన బృందం చెట్ల మాటున అదృశ్యమైంది. వాళ్ళ గానం మాత్రం ఆ నిశ్శబ్ద నిశీథిలో శ్రవణానందకరంగా వినిపిస్తోంది.

''గొల్లెతలు చల్లలు గొనకొని చిలుకగ
వెల్లివిరియాయె విష్ణు కథ
ఇల్లిదె శ్రీవేంకటేశ్వరు నామము
వెల్లిగొలిపెనీ విష్ణుకథ!
వినరో భాగ్యము విష్ణుకథ!
వెనుబలమిదివో విష్ణుకథ!''

నారదుడు ఆనందాశ్రువులు తొణికిసలాడే కళ్ళతో ఆనంద సర్వస్వంలా మూర్తీభవించిన ఆనంద నిలయుడి ముఖ మండలాన్ని చూశాడు.

''అద్భుతం! మహాద్భుతం!'' నారదుడు ఉద్రేకంతో అన్నాడు. భావమూ, భాషా ఒకదానితో ఒకటి పెనవేసుకున్నాయి! ఎవరిది స్వామి ఈ పాట?''

''తాళ్ళపాక అన్నమయ్య అనే నా ఆంతరంగిక భక్తుడు రాశాడు. తన జీవిత కాలమంతా రోజుకో సంకీర్తన చొప్పున నన్ను కీర్తిస్తూ రాశాడు. మరొక విషయం తెలుసా నారదా? మా దంపతుల శృంగారాన్ని మధురాతిమధురంగా వర్ణిస్తూ, ఎన్నో శృంగార సంకీర్తనలు రచించాడు అన్నముడు!''

''శృంగార సంకీర్తనలా?'' నారదుని ప్రశ్నలో ఆశ్చర్యం.

''ఆ! అనితరసాధ్యమైన రీతిలో రచించాడు ఆ శృంగార సంకీర్తనలను. అవన్నీ ఆత్మైక్యంలో పరవసించే అమృత గుళికలు! 'విచ్చేయవమ్మా వెన్నెల బొమ్మా!' అంటూ పద్మను 'వెన్నెల బొమ్మా' అన్నాడు!

''ఆహా! అన్నమయ్యా, నీ జీవితం ధన్యమయ్యా!'' నారదుడు పారవశ్యంతో అన్నాడు. ''ఇందాకా మీరు వివరించిన యతి ప్రాసలు ఈ పాటలో కూడా ఉన్నాయిగా, స్వామీ?''

''ఉన్నాయి. పద్యాలకి ఉన్న యతిప్రాస నిబంధనను తన సంకీర్తనా రచనలో కూడా అద్వితీయంగా పాటించాడు అన్నముడు. సహజంగా తేనెల సొనతో తెలుగు పలుకుబడిని దివ్యంగా ఉపయోగించుకున్నాడు...''

''స్వామీ, ఈ సంకీర్తన ఆలకిస్తూ ఉంటే తెలుగు భాష రాగాలాపనకి చాలా అనువైన భాషలా అనిపించింది...''

''అవును. అచ్చులతో అంతమయ్యే ఏకైక భాష ఈ వేద భూమిలో తెలుగు ఒక్కటే!''

''కీర్తనలో నా నామధేయమూ ఉంది!'' నారదుడు ఆనందంగా అన్నాడు.

''నీకు తెలియదు నారదా! తెలుగు నాటకాలూ, చలన చిత్రాలూ అనే దృశ్య ప్రబంధాలలో నా అవతారాలైన శ్రీరాముడి పాత్రనూ, శ్రీకృష్ణుడి పాత్రనూ, తోడుగా నీ పాత్రనూ సాహితీ వేత్తలు రూపొందించిన విధానం అనన్య సామాన్యమూ, అనితర సాధ్యమూ, అద్వితీయమూ! ఆయా పాత్రలు పలికిన ఆ తెలుగు మాటలూ, పాడిన పాటలూ, పద్యాలూ-ఓహ్!''

తన్మయత్వంతో ఆపిన వేంకటేశ్వర స్వామిని నారదుడు చిరునవ్వుతో చూశాడు.

''మన పాత్రలు ఆయా సాహితీ రూపాలలో అంటే కావ్యాలలో, ప్రబంధాలలో, ఇతిహాసాలలో, పురాణాలలో- అద్వితీయంగా ఆవిష్కరించబడడానికి కారణం తెలుగు భాష! ఆ బంగారు భాషలో కవుల గంటాలు కదను తొక్కాయి.

''నిజమా స్వామీ?''

''ముమ్మాటికీ! 'తెలుగు పలుకు తేనెలొలుకు' అని నిస్సంకోచంగా చెప్పవచ్చు! నువ్వు కూడా తెలుగు పాటలు పాడడం ప్రారంభించు నారదా!''

''ఆజ్ఞ! తెలుగు గొప్పదనాన్ని లోకాలన్నింటా చాటుతాను!'' నారదుడు ఉద్రేకంగా అన్నాడు.

''ఈ తెలుగు గడ్డ మీద ఎందుకు విడిది చేశానో, కొల్హాపురం వెళ్ళకుండా ఇక్కడికి ఎందుకు చేరానో అర్థమైందా, నారదా? నిజం చెప్పాలంటే అర్ధాంగిని వెదుకుతూ ఇక్కడికి రాగానే తెలుగు భాష నన్ను కట్టిపడవేసింది!'' వేంకటేశ్వర స్వామి చిరునవ్వుతో అన్నాడు. ''నీ సందేహం నివృత్తి అయిందా?''

''కలియుగ ప్రత్యక్షదైవం సెలవిస్తే నివృత్తి కాకుండా ఉంటుందా, స్వామీ?'' నారదుడు నవ్వుతూ అన్నాడు.

''నన్ను 'తెలుగు వేలుపు' అంటే ఆనందిస్తాను, నారదా!''

''నారాయణ! అలాగే! తెలుగు వేలుపు! ఓహ్! మీ హృదయాన్ని చూరుగొన్న తెలుగుభాషదీ, తెలుగు వారిదీ స్వామీ అదృష్టమంటే!''

''త్వరగా వెళ్ళాలి, నారదా!'' వేంకటేశ్వరుడు నవ్వుతూ అన్నాడు.

''నారాయణ!'' నారదుడు చేతులు జోడించి ఆకాశమార్గం పట్టాడు.

వేంకటేశ్వరుడు వెన్నెల బొమ్మను తలుచుకుంటూ వేగంగా మెట్లు దిగుతున్నాడు. ఇన్ని మెట్లూ, ఇన్ని కొండలూ దిగి, నడిచి వెళ్తేనే తనకు తృప్తి!

వినరో భాగ్యము విష్ణుకథ! వెను బలమిదివో విష్ణు కథ!''- వినువీధిలో నారదుడు గానం చేస్తూ వెళ్తున్నాడు. తల ఎత్తి చూసి, తృప్తిగా నవ్వుకున్నాడు తెలుగు వేలుపు.

★

రచయిత సెల్ : 98662 67287

## తమిళనాట మరో అసిన్...!



ఈ ఫోటోలోని ముద్దుగుమ్మను చూస్తుంటే అచ్చు అసిన్‌ని చూస్తున్నట్లుంది కదూ? అసిన్‌లోని ఎన్నో పోలికలతో ఉన్న ఈమె పేరు పూర్ణ. తమిళ నటి. అసిన్ బాలీవుడ్‌లో బిజీ అయి కోలీవుడ్‌కి దూరమవడాన్ని తమిళ తంబీలు జీర్ణించుకోలేకపోయారు. అసిన్ పోలికలతో ఉన్న పూర్ణ కనపడడంతో సంతోషంతో తబ్బిబ్బయ్యారట! అసిన్‌ను ఈమెలో వెతుక్కుని సంతోషపడదామనుకున్నారు. కానీ వారి ఆశ నెరవేరలేదు. కోలీవుడ్‌లోని టాప్ హీరోలకు – అసిన్‌కూ, పూర్ణకు మధ్య బోలెడంత వ్యత్యాసం కనిపించడంతో ఆమెతో నటించడానికి ఇష్టపడలేదట! దాంతో పూర్ణ చిన్న చిన్న హీరోలతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. తమిళ తంబీలు వద్దు పొమ్మన్నవారిని మన వారు ఆదరించడం షరా మామూలే కాబట్టి పూర్ణ తన దృష్టిని టాలీవుడ్‌పై కేంద్రీకరించిందట! ప్రస్తుతం ఇక్కడ ఓ సినిమా చేస్తోంది. మరో రెండు సినిమాలు అంగీకరించిందట! మరి మన టాలీవుడ్ హీరోలు పూర్ణలో అసిన్‌ని వెతుక్కుంటారో లేదో చూడాల్సిందే!